త్వరలో అందరికీ పట్టాలు


శంకర్‌పల్లిలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి భూమిపూజ చేస్తున్న మంత్రి కేటీఆర్


మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం పర్యటించారు. రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సింగరేణి స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నీతానై సక్సెస్ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి తమ ప్రభుత్వ హయాంలో పట్టాలు పంపిణీ చేస్తున్నామని, అయితే రామకృష్ణాపూర్ పట్టణంలో మిస్సయిన కొన్ని ఏరియాలకు కూడా త్వరలో పంపిణీ చేస్తామని విప్ సుమన్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. క్యాతనపల్లి ఆర్‌వోబీ పనులకు సంబంధించి కొన్ని నిధులు పెండింగ్‌లో ఉండడంతో పూర్తికావడం లేదని, మంత్రి ఈ విషయంలో చొరవ తీసుకుని నిధులు వి డుదల య్యేలా చూడాలని కోరారు. రామకృష్ణాపూర్ ప్రాంతం ఒకప్పుడు గనులు, కార్మికులతో కళకళలాడేదని, గనులు మూతపడడంతో ఈ ప్రాంతం నుంచి ప్రజలు వలస వెళ్తున్నారని సుమన్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని కేటీఆర్‌కు విన్నవించారు.

టెంట్లు లేక ప్రజల ఇక్కట్లు


సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

మంత్రి పర్యటన సందర్భంగా రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగసభకు విచ్చేసిన ప్రజలు కొంత అసహనానికి గురయ్యారు. సభా ప్రాంగణంలో వేలసంఖ్యలో కుర్చీలు వేసినప్పటికీ నీడ కోసం ఒక్క టెంట్ కూడా వేయలేదు. మిట్ట మధ్యాహ్నం సభ నిర్వహించడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతకు తట్టుకోలేక అసంతృప్తికి గురయ్యారు. కొంతమంది బాహాటంగానే విమర్శలు చేశారు. కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు సభ జరుగుతుండగానే బయటకు వెళ్లడం కనిపించింది. పరిస్థితి గమనించిన మంత్రి కేటీఆర్ 'ఎండలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టను' అంటూ 20 నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. అయితే అప్పటికే పలువురు మహిళలు వేడి, ఉక్కపోతతో సొమ్మసిల్లి పడిపోవడంతో వారిని అక్కడి నుంచి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు.

భారీ బందోబస్తు

మంత్రి కేటీఆర్ పర్యటనలో అడుగడుగునా బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటించిన రోడ్డు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మరోవైపు శనివారం రాత్రి నుంచి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, వామపక్ష, విద్యార్థి సంఘాల నాయకుల్ని పోలీసు స్టేషన్లకు తరలించారు.

కేటీఆర్‌ను ఆపిన రైల్వేగేటు

కొన్నేళ్లుగా రామకృష్ణాపూర్ వాసులు మంచిర్యాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వోబీ త్వరగా పూర్తి చేయాలని సభలో ఎమ్మెల్యే కోరగా తిరిగి వచ్చే క్రమంలో అదే రైల్వే గేటు పడి కేటీఆర్ కాన్వాయ్‌ను కాసేపు నిలిపివేసింది. దీంతో స్థానికులు మంత్రి కూడా ఆర్వోబీ తిప్పలు తప్పలేదనుకున్నారు.

మందమర్రిలో రోడ్‌షో

మందమర్రిరూరల్: కేటీఆర్ పర్యటనలో భాగంగా మందమర్రిలో బాల్క సుమన్‌తో కలిసి రోడ్‌షో చేశారు. తర్వాత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల భవిష్యత్ కోసం కేసీఆర్ ఆలోచిస్తే కాంగ్రెస్, బీజేపీ సింగరేణికి నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ఆధ్వర్యంలో సింగరేణిలో అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. లాభాల బోనస్ 32 శాతం, దీపావళి బోనస్ రూ.వెయ్యి కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే మందమర్రి మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదని విమర్శించారు.

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రి మున్సిపాలిటీకి పాలకవర్గం లేక అభివృద్ధికి నోచుకోవడం లేదని, వెంటనే ఎన్నికలు జరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందించారు. లెదర్‌పార్క్ తెరిపించాలని, ఆసరా ఫించన్లను బ్యాంకుల ద్వారా ఇవ్వాలని కోరారు. లింగయ్య, శ్రీనివాస్, దుర్గరాజ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'గులాబీ' గాజులు చల్లి నిరసన

చెన్నూర్‌లో అభివృద్ధి జరగడం లేదని.. ఇది ఎమ్మెల్యే చేతగాని తనమే.. అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిళ్ల రాధిక ఆదేశాలతో మహిళా కార్యకర్తలు ఠాగూర్ స్టేడియంలో పలుచోట్ల గులాబీరంగు గాజులు చల్లి నిరసన తెలిపారు. అక్కడున్న పోలీసులు గుర్తించి విడిగా కవరులో తెచ్చిన వాటిని అడ్డుకున్నారు. అయితే కొందరు మహిళలు గాజులు చేతికి వేసుకుని వచ్చి సభలో పలు చోట్ల పారబోశారు.


సభలో వెదజల్లేందుకు తెచ్చిన గులాబీ రంగు గాజులు

క్లుప్తంగా

ధోబీలు, బార్బర్లను క్రమబద్ధీకరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ధోబీలు, బార్బర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ధోబీ, బార్బర్లను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వ ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ధోబీ, బార్బర్‌లు ఆదివారం వినతిపత్రం అందజేశారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కంది శ్రీనివాస్, కాంట్రాక్ట్ ధోబీస్, బార్బర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆదినారాయణ, వెంకటస్వామి, శంకర్, తిరుమల, వెంకటేశ్, బాపు ఉన్నారు.

డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడలు ప్రారంభం


క్రీడలు ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 59వ వార్షిక క్రీడలు ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. జీఎం మనోహర్ ఏరియాస్థాయి బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, కల్చరల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ క్రీడలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. క్రీడలతో కార్మికులకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం మైత్రేయబంధు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ రవికుమార్, కెప్టెన్ వెంకటేశ్వర్లు, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి పాల్గొన్నారు.

రెండోవిడత గొర్రెల పంపిణీని ప్రారంభించాలి

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించాలని మండల యాదవ సంఘం అధ్యక్షుడు బొంతల మల్లేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొల్లకుర్మల అభివృద్ధి కోసం ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపట్టిందన్నారు. రెండో విడత గొర్రెల కోసం ఏడాది క్రితం వడ్డీకి తీసుకువచ్చి డీడీలు తీసి నష్టపోయారని పేర్కొన్నారు. అధికారులు తూతూమంత్రంగా పంపిణీ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. డబ్బులు ముట్టజెప్పిన వారి పేర్లు లిస్టులో ఉంటున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా గొర్రెల పంపిణీ జరిగేలా చూడాలని కోరారు. ఆలస్యమైతే సంబంధిత అధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. మండల యాదవ సంఘం ఉపాధ్యక్షులు మల్లేశ్, నర్సయ్య యాదవ్, శ్రీనివాస్, రాజన్న, హన్మండ్లు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పారిశుధ్య పనులు

చెన్నూర్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 సఫాయిమిత్ర సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో గల రోడ్డును శుభ్రం చేయడంతోపాటు చుట్టుపక్కల పిచ్చిమొక్కలు తొలగించామన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

పాతమంచిర్యాల: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీలో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రమాదేవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. సభ్యులు లలిత, రమ్య, రజిత, ఝాన్సీ, విజయ పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థికి మద్దతు

శ్రీరాంపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థికే మద్దతు ఇస్తామని కుల,సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మున్నూరు కాపు, ముదిరాజ్ కులస్తుల సమావేశం వేర్వేరుగా జరిగింది. సమావేశానికి నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. తాను మంచిర్యాల నుంచి బరిలో ఉంటానని ప్రకటించారు. ఆయా కులస్తులు తమ మద్దతు తెలిపారు. సమావేశంలో మున్నూరు కాపు జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశం, నాయకులు అల్లం మల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన నాయకులు


సభకు వెళ్తున్న నాయకులు


ఆస్నాద నుంచి వెళ్తున్న నాయకులు

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/భీమారం: మందమర్రి, రామకృష్ణాపూర్‌లో ఆదివారం రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. చెన్నూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, నాయకులు సాధనబోయిన కృష్ణ, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, అనిల్, తుమ్మ రమేశ్ ఉన్నారు. ఆస్నాద, కిష్టంపేట, సోమనపల్లి, సంకారం, సుద్దాల తదితర గ్రామాల నుంచి నాయకులు వాహనాల్లో వెళ్లారు. భీమారం మండలంలోని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు బస్సులు, వాహనాల్లో వెళ్లారు.

నాయకుల ముందస్తు అరెస్టు


పోలీసుల అదుపులో పార్టీల నాయకులు


పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన మహిళలు

మందమర్రిరూరల్/బెల్లంపల్లి/నెన్నెల/చెన్నూర్/దండేపల్లి: మందమర్రిలో ఆదివారం రాష్ట్రమంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా జిల్లాలో పలు పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మందమర్రిలో నాయకులను అదుపులోకి తీసుకుని బెల్లంపల్లి గెస్ట్‌హౌజ్‌కు తరలించారు. టీడీపీ నాయకుడు సంజయ్‌కుమార్, బీజేపీ నాయకులు నర్సింగ్, నరేశ్, కాంగ్రెస్ నాయకులు ఉపేందర్, జీవన్, బీఎస్పీ నాయకులు రమేశ్, భవానీ, పార్టీల నాయకులు సుదర్శన్, సరిత, అజీమొద్దీన్ ఉన్నారు. బెల్లంపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, పట్టణ అధ్యక్షుడు రమేశ్, ఇతర శ్రేణులు, టీడీపీ నాయకుడు మణిరాంసింగ్, ఇఫ్టు నాయకుడు ఎండీ చాంద్ పాషా స్టేషన్‌లలో ఉంచారు. కాంగ్రెస్ నాయకుడు నాతరి స్వామిని హౌజ్ అరెస్టు చేశారు. నెన్నెలలో బీజేపీ జిల్లా నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, గోగు సురేందర్‌లను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. చెన్నూర్‌లో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, వైఎస్సార్‌టీపీ నాయకులను అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అంకగౌడ్, పాతర్ల నాగరాజు, ఖలీల్, కృష్ణగౌడ్, చింతల శ్రీనివాస్, వంశీగౌడ్, కొంపల్లి బానేశ్, దుర్గం నగేశ్, నిట్టూరి సారయ్య ఉన్నారు. దండేపల్లి మండల బీజేపీ నాయకులు రాజయ్య, సురేందర్, రవీందర్, రాకేశ్ అరెస్ట్ చేశారు.

తాండూర్: సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాంను పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం ఉద్రిక్తలకు దారి తీసింది. రాజారాంను ఆదివారం తెల్లవారు జామున ఇంటికి వెళ్లి అదుపులో తీసుకున్నారు. ఆయన్ను విడుదల చేయాలని అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, సీఐటీయూ శ్రేణులు పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసులను నిలదీశారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించడంతో ఆయన్ను విడుదల చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

చెన్నూర్: పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. లైన్‌గడ్డ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇమామ్‌లను సన్మానించారు. ముస్లిం మైనార్టీ నాయకులు ఆరీఫ్, షఫీ, ముజ్జు, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ జాగృతి ఆవిర్భావ వేడుకలు

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలో సోమవారం తెలంగాణ బీసీ జాగృతి 8వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్డి కాలనీలోని బీసీ జాగృతి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే వేడుకలను నాయకులు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా ఉదయం 11 గంటలకు బెల్లంపల్లి(పూలే)చౌరస్తా వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చట్టసభల్లో అవకాశం కోసం పోరాటం

- మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్

జన్నారం: కులాల దామాషా ప్రకారం చట్ట సభల్లో అవకాశం కల్పించాలనే ఉద్దేశంలో ఈనెల 3న నిర్మల్ జిల్లా కేంద్రంలో మోకుదెబ్బ గౌడ గర్జన మూడో మహాసభలు నిర్వహిస్తున్నట్లు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్ తెలిపారు. గౌడగర్జన సభకు సంబంధించిన పోస్టర్లను మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సాగౌడ్ మాట్లాడుతూ మోకుదెబ్బ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గౌడ సంఘ నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోకుదెబ్బ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములుగౌడ్, రాష్ట్ర నాయకులు బాలసాని శ్రీనివాసగౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఒ ల్లాల నర్సాగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడ్, యూత్ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, నాయకులు శంకర్ గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరం

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని ప్లంబర్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా ప్లంబర్ అసోసియేషన్, జనయేత్రి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దంతవైద్యుడు హుస్సేన్, నేత్ర వైద్యుడు సయ్యద్ ఇలియాస్‌లు 80 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ముత్యంపేటలో .

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటలో ఇటీవల ఓ మహిళకు డెంగీ సోకింది. వైద్య చికిత్స అందించడంతో కోలుకుంటుంది. ఆదివారం దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సతీశ్, ఎంపీడీవో మల్లేశం, వైద్యసిబ్బంది ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆమె ఇంట్లో, ఇంటి పరిసరాలతోపాటు, సమీప ఇళ్లలో దోమల నివారణ మందు పిచికారి చేయించారు. అనంతరం కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి మందులు అందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో ఈనెల 4న వంచిత్ బహుజన్ అఘాడీ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. జిల్లా కేంద్రంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రశాంత్, రజిత పాల్గొన్నారు.

చీరెల పంపిణీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథరావు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. హరిగోపాల్, సతీశ్‌రావు, ప్రభాకర్, మధు, గంగన్న, చంద్రమౌళి, నాగరాజు పాల్గొన్నారు.

బెంచీల విరాళం

జన్నారం: తమ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలకు బెంచీలను విరాళంగా ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగి తన ఉదారత చాటుకున్నాడు. మండలంలోని రేండ్లగూడకు చెందిన క్రైం బ్రాంచ్ ఆసిఫాబాద్ ఎస్సై కస్తులపూర్ సాగర్ తాను చదువుకున్న ఉన్నత పాఠశాలకు ఒక్కొక్కటి రూ.2 వేల చొప్పున ఆరు బెంచీలను విరాళంగా అందజేశారు. హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు రాజరావ్, శ్రీలత, బాపు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు నివాళి

దండేపల్లి: దేశ వ్యవసాయ రంగానికి విశేష కృషిచేసిన భారత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ మృతి, దేశ వ్యవసాయ రంగానికి తీరని లోటని దండేపల్లి రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. దండేపల్లిలో ఆదివారం నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు సత్తన్న, భూమన్న, రాయలింగు, రాజన్న, ఎల్లయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని గూడెంలో డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. నాయకులు తిరుపతి, మధు, రాజయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని శ్రీ శివసాయి గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన మాలతి, పోతపల్లి గ్రామానికి చెందిన తిరుమలకు కుట్టు మిషన్లు అందజేశారు. పేద మహిళలు జీవనోపాధి పొందేందుకు హైదరాబాద్‌కు చెందిన దేవిక, చైతన్య సహాయంతో కుట్టుమిషన్లు అందించినట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామూర్తి, సభ్యులు సుమతమ్మ, ప్రసన్న, రవీందర్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఆవిర్భావ వేడుకలు

పాతమంచిర్యాల: బీఎస్‌ఎన్‌ఎల్ ఆవిర్భావ వేడుకలను జిల్లాకేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. డీఈ సోమయ్య, సబ్ డివిజనల్ ఇంజనీర్లు మధుకర్, క్రాంతికుమార్, జేటీవోలు జానయ్య, రాజేశం, దుర్గయ్య పాల్గొన్నారు.

ఊరూరా స్వచ్ఛత పనులు


బెల్లంపల్లి: రోడ్డు శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు


మంచిర్యాల బస్‌స్టేషన్‌లో..


చెత్త తొలగిస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి: స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెల్లంపల్లిలో మున్సిపల్ అధికారులు ,ప్రజా ప్రతినిధులు, సిబ్బంది శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంటా చౌరస్తా, బజారు ఏరియా ప్రాంతంలో స్వచ్ఛత కార్యక్రమం చేశారు. కాంటా చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి బూడిదగడ్డ బస్తీకి వెళ్లేదారిలో జమా మసీదు వరకు డివైడర్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు చీపురుపట్టి రోడ్డును శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, కె.సురేష్, ఆస్మాషేక్, నెల్లి శ్రీలత, సూరం సంగీత, తుంగపల్లి సుజాత, కేంశెట్టి సరిత, రాజనాల కమల, కె.చంద్రశేఖర్, మాటూరి మధు, కోఆప్షన్ సభ్యురాలు మేరీ సుశీల, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వీధులను ఊడ్చి శుభ్రపర్చారు. ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, యూనిట్ 1 ప్రోగ్రాం ఆఫీసర్ వి.స్వప్న, యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.జ్యోతి, టి.రమాదేవి, ఏ.భాగ్యలక్ష్మి, వి.దివ్య, కె.అంజలి పాల్గొన్నారు.

- ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బీజేవైఎం, బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తా చెదారం తొలగించి, పిచ్చిమొక్కలను తొలగించారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత పనులు చేపట్టారు. నాయకులు రాజలింగు, రాజనర్సు, విజయ్, అజయ్, సుధాకర్, తిరుపతి, విఘ్నేష్ పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. సామర్షియల్ సీఐ రవికుమార్, ఎం.రవీందర్, బీఎస్ఎం రావ్, పాయింట్ మెన్స్, టికెట్ చెకింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండ గ్రామంలో శ్రమదానం నిర్వమించారు. సర్పంచ్ జాడి సత్యం, ఎంపీడీఓ అబ్దుల్‌హై, కార్యదర్శి రఘు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొని రోడ్లు ఊడ్చడంతో పాటు రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించారు.

మంచిర్యాలటౌన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకేంద్రంలో చెత్తను తొలగించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి పురుషోత్తం, రజనీశ్ జైన్, మున్నారాజ్ సిసోడియా, పురుషోత్తం జాజు, తులా ఆంజనేయులు, రేకందర్ వాణి, ఆకుల అశోక్ వర్ధన్, మాసు రజనీ, గాజుల ప్రభాకర్, రాజబాబు, చిప్పరి రాజమల్లయ్య, దేవేందర్, అమిరిశెట్టి రాజు, భూమేశ్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ఆదివారం పీహెచ్‌సీ, జీపీ సిబ్బంది శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఎంపీడీవో మల్లేశం, పీహెచ్‌సీ వైద్యుడు సతీశ్, సర్పంచ్ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, పీహెచ్‌సీ, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ మోడల్‌స్కూల్, కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. రోడ్డు శుభ్రం చేశారు. అనంతరం రాజీవ్‌నగర్‌లో రోడ్లకు ఇరువైపులా చెత్తను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటరీలు పాల్గొన్నారు.

- కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయులు మంచిర్యాల బస్‌స్టేషన్, పరిసరప్రాంతాలు శుభ్రం చేశారు. ఖాళీ వాటర్‌బాటిళ్లు, ఇతర చెత్త చెదారం తొలగించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

లక్సెట్టిపేట: ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సిబ్బంది చెత్తను తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెట్ శ్రీనివాస్, వైద్యులు పవిత్ర, సురేష్, శ్రీదేవి, సంగీత, మంజుకుమారి బుద్దె సత్యనారాయణ, విక్రమ్ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాలు చేశారు. తంగళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చెత్తాచెదారం తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ దాముక ప్రభుదాస్, బ్యాంకు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి కార్మికులను బదిలీ చేయొద్దు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి సిబ్బందిని గోలేటి టౌన్‌షిప్‌కు బదిలీ చేయవద్దని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సింగరేణి అధికారులను ఆదేశించారు. ఆదివారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కార్మికులు గోడు వెళ్లబోసుకోగా స్పందించిన ఎమ్మెల్యే బెల్లంపల్లి ఏరియా జీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులను గోలేటి టౌన్‌షిప్‌కు బదిలీ చేయొద్దని జీఎంకు సూచించారు. అవసరమైతే అదనంగా మరికొంత మందిని గోలేటి టౌన్‌షిప్‌కు బదిలీపై రప్పించుకోవాలి తప్పా ఆసుపత్రి నుంచి ఏ ఒక్కరిని బదిలీ చేయరాదని సూచించారు. ఇందుకు జీఎం సానుకూలత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు గెల్లి రాజలింగు, సోకాల శ్రీనివాస్, సత్యనారాయణ, సీహెచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.